క్లుప్తంగా

ఎంపీతో మంత్రి భేటీ



నెల్లూరు రూరల్: ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

150 మందికి నేత్ర పరీక్షలు



నెల్లూరు(బారకాసు): యలమవారిదిన్నెలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున పర్యవేక్షణలో స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో శిబిరాన్ని జరిపారు. దాదాపు 150 మందికి నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ సాయిప్రతీక్, వైద్య సిబ్బంది చరీఫా, భవానీ, ప్రశాంత్, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

నగదును దోచుకున్న నిందితుడి అరెస్ట్



నెల్లూరు సిటీ: కత్తితో బెదిరించి నగదును దోచుకున్న నిందితుడ్ని చిన్నబజార్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నగరంలోని చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో నిందితుడి వివరాలను ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు, ఎస్సై సైదులు వెల్లడించారు. పెద్దబజార్‌లోని చేపల మార్కెట్ వద్ద షోయబ్ తన ఆటోలో సోడాలను దుకాణాలకు ఈ నెల 11న వేస్తుండగా, నిందితుడు పఠాన్ తౌసిఫ్‌ఖాన్ అడ్డగించారు. తనకు డబ్బులివ్వాలని, లేని పక్షంలో తండ్రిని చంపుతానని బెదిరించారు. దీంతో బాధితుడు తన వద్ద ఉన్న రూ.200ను ఆయనకు ఇచ్చారు. గతంలోనూ తౌసిఫ్‌ఖాన్ ఇదే తరహాలో బాధితుడ్ని బెదిరించారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



కరపత్రాన్ని అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 18వ డివిజన్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్నామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను తెలియజేస్తే, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆదరించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్ అశోక్, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, హరిబాబు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో కొలువైన మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవీ, భూదేవి సమేత గురువాయూర్ మహావిష్ణుకు తిరుకల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా బుధవారం జరిపారు. స్వామివారికి పుష్పాభిషేకాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా గంటా రమణయ్యనాయుడు, ప్రమీలమ్మ దంపతులు, మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు, తదితరులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, మోహన్‌రావు, మురళీమోహన్‌రెడ్డి, శంకరన్, బట్టేపాటి నరేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం



నెల్లూరు(అర్బన్): నడకతో ఆరోగ్యంగా జీవించొచ్చని బృందావనం, పొగతోట రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ పల్లం రెడ్డి యశోధర పేర్కొన్నారు. గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో బృందావనం, పొగతోట వాకర్స్ అసోసియేషన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షురాలిగా యశోధర, ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. 203 వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్వీ రెడ్డి, శ్రీమన్నారాయణ, నాగేశ్వరరావు, రమాదేవి, రామ్మోహన్‌రావు, విజయకుమార్, నవీన్, ప్రభాకర్, కృష్ణమూర్తి, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులపై స్పెషల్ డ్రైవ్



నెల్లూరు (వీఆర్సీ సెంటర్): పెండింగ్ విద్యుత్ బిల్లులపై స్పెషల్ డ్రైవ్‌ను అధికారులు బుధవారం నిర్వహించారు. ఈస్ట్ – 1 సెక్షన్ పరిధిలోని 53, 54వ డివిజన్లలో గల జనార్దన్‌రెడ్డి కాలనీ, భగత్‌సింగ్ కాలనీల్లో కార్యక్రమాన్ని ఏఈ విజయ్‌కుమార్ చేపట్టారు. రూ.50 వేల మేర పెండింగ్ బిల్లులను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీ లిస్ట్‌పై నిర్లక్ష్యం తగదని, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



నెల్లూరు (టౌన్): కొండాయపాళెంలోని మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ రావు శ్రీనివాసరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నగరాధ్యక్షుడు తాళ్లూరి సురేష్‌బాబు, డివిజన్ కన్వీనర్లు గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుకు వినతి

నెల్లూరు రూరల్: నగరంలోని కొండాయపాళెంలో ఎరుకుల సామాజికవర్గానికి చెందిన వారికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని ఎరుకుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు శివకృష్ణ కోరారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ తహసీల్దార్ సుబ్బయ్యకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు.

రక్తదానంతో ప్రాణదానం



నెల్లూరు(అర్బన్): రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని వైద్య ఉద్యోగులు బుధవారం నిర్వహించారు. అనంతరం పలువురు వైద్యశాఖ అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఏడీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్, డాక్టర్ సునీల్, డెమో అధికారి శ్రీనివాసులు, రెడ్‌క్రాస్ వైద్యాధికారి జయసింహ పాల్గొన్నారు.

డిప్యూటీ సిటీ ప్లానర్ బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న దేవీకుమారి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగ డిప్యూటీ సిటీ ప్లానర్‌గా దేవీ కుమారి బాధ్యతలను బుధవారం స్వీకరించారు. తొలుత కమిషనర్ వికాస్ మర్మత్‌కు జాయినింగ్ రిపోర్టును అందించారు. అనంతరం కార్యాలయంలోని పురసేవ సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక విభాగాధికారులు, వార్డు సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు.

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఏసీనగర్‌లో ఇంటింటి ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు బుధవారం నిర్వహించారు. పార్టీ నేతలు డాక్టర్ యశోధర, మరియమ్మ, ఝాన్సీరాణి, హజరత్తయ్య, దాసు పాల్గొన్నారు.

సౌత్‌మోపూరు విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు రూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ కొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సర పరీక్షలకు 23 మంది హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. అఖిల్ 916 మార్కులను సాధించి కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు 23 మంది హాజరుకాగా, 22 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.

‘మెడికవర్’లో బోన్‌మ్యారో యూనిట్ ప్రారంభం



బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన వైద్యసేవలందిస్తున్న మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. నగరంలోని మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాన్ని బుధవారం ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. మహానగరాలకే పరిమితమైన బోన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాన్ని నెల్లూరులో తొలిసారిగా ప్రవేశపెట్టడం జిల్లా వాసులకు ఎంతో ఉపయోగమన్నారు. మెడికవర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కృష్ణ నెల్లూరుకు చెందిన వ్యక్తి కావడంతో ఇక్కడి ప్రజల కోసం ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. విద్య, వైద్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలకు ఉత్తమ వైద్యసేవలను అందించేందుకు గానూ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను విస్తృతం చేశారని వివరించారు. బోన్ మ్యారో చికిత్సకు రూ.తొమ్మిది లక్షలను రాష్ట్ర ప్రభుత్వం గరిష్టంగా అందిస్తోందన్నారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసులు, మొయిళ్ల గౌరి, మెడికవర్ హాస్పిటల్స్ పీఆర్వో శ్రీలక్ష్మి, ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్, కేన్సర్ వైద్య నిపుణుడు రంగరామన్, డాక్టర్ శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

‘నారాయణ’ విజయకేతనం



నెల్లూరు (టౌన్): నీట్, ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో నారాయణ మెడికల్ అకాడమీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను గోమతినగర్‌లోని నారాయణ విద్యాసంస్థల కార్యాలయంలో అభినందించిన అనంతరం మాట్లాడారు. నీట్‌లో వెంకలక్ష్మీసాహితి 796, భానుశంకర్ 1060, రామ్‌కుమార్ 1146, అక్షయరెడ్డి 1403, ధోనీ అభినవ్ 4314, రిషికారెడ్డి 4798, సాత్విక్ 6304వ ర్యాంకులను సాధించారని పేర్కొన్నారు. కేటగిరీల్లో భానుశంకర్ 24, సాత్విక్ 153, రామ్‌కుమార్ 291, లక్ష్మీసాహితి 528వ ర్యాంకులను సాధించారని వెల్లడించారు. 650కుపైగా ఏడుగురు, 600కుపైగా 24 మంది, 500కు పైగా 147 మంది సాధించారన్నారు. ఏపీఈఏపీ ఇంజినీరింగ్‌లో ప్రణీత్‌సాయి 42, మేఘన 232, లోహిత్ ఆదిత్య 304, ప్రణవ్‌సాయి 386, అర్జున్ 415వ ర్యాంకులను సాధించారని తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో భానుశంకర్ 102, లక్ష్మీసాహితి 116, ధోనీ అభినవ్ 147, రామ్‌కుమార్ 183వ ర్యాంక్‌ను సాధించారని వెల్లడించారు.

‘డాక్టర్స్ మెడికల్ అకాడమీ’ ప్రతిభ



నెల్లూరు (టౌన్): నీట్ ఫలితాల్లో డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి తెలిపారు. ర్యాంకులను సాధించిన విద్యార్థులను హరనాథపురంలోని అకాడమీలో అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహమ్మద్ షరీఫ్ ఆజ్మీ 680, వైష్ణవి 646, అర్జున్‌రెడ్డి 632, లీనాసాయి 627, విక్రమ్ నటరాజ్ 621, త్రిలోక్‌రాజ్ 600 మార్కులను సాధించారని పేర్కొన్నారు. కళాశాల వైస్ చైర్మన్ పార్థీవ్‌రెడ్డి, డైరెక్టర్ రహీమ్ పాల్గొన్నారు.

అజీజ్‌కు ఎంపీ పరామర్శ

నెల్లూరు రూరల్: టీడీపీ నేత అబ్దుల్ అజీజ్‌ను హరనాథపురంలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న అజీజ్ ఆరోగ్య పరిస్థితిని ఎంపీ అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కాంక్షించారు.

విద్యాకానుక అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 15వ డివిజన్ బాలాజీనగర్‌లో గల బాజీతోట స్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు యూనిఫారం, బ్యాగులు, పుస్తకాలను కార్పొరేటర్ గణేశం సుజాత అందజేశారు.

కో ఆపరేటివ్ సొసైటీలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న సుధాభారతి

నెల్లూరు రూరల్: జిల్లాలోని కో ఆపరేటివ్ సొసైటీల ద్వారా తోడ్పాటును అందిస్తున్నామని జిల్లా కో ఆపరేటివ్ అధికారి సుధాభారతి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని కో ఆపరేటివ్ సొసైటీని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. రైతులకు సకాలంలో రుణాలను అందించాలని కోరారు. జిల్లాలోని పలు కో ఆపరేటివ్ సొసైటీలు లాభాల బాటలో పయనిస్తున్నాయని వెల్లడించారు. సొసైటీ సీఈఓ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



చెక్కును అందజేస్తున్న శంకర్‌బాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తూ, వారి మన్ననలను పొందడమే ప్రథమ కర్తవ్యంగా సిబ్బంది భావించాలని డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వాణిజ్య బ్యాంకులు ఇవ్వని విధంగా డిపాజిట్లపై అత్యధిక వడ్డీని చెల్లిస్తున్నామని తెలిపారు. 80 ఏళ్లపైబడిన సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.25 వడ్డీతో పాటు రికరింగ్ డిపాజిట్లపై సైతం అదే వడ్డీని అందిస్తున్నామని చెప్పారు. డీసీసీబీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రూ.50 కోట్ల రుణాలను అందజేశామని వెల్లడించారు. అనంతరం పలు స్వయం సహాయక గ్రూపులకు రూ.10 లక్షల మేర రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్, ఫీల్డ్ ఆఫీసర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో చెత్త కనిపిస్తే చర్యలు



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలో మెరుగైన పారిశుధ్యం కోసం ప్రజలు సహకరించాలని, వీధుల్లో చెత్త కనిపిస్తే శానిటేషన్ కార్యదర్శులను బాధ్యులను చేస్తూ చర్యలు చేపడతామని కమిషనర్ వికాస్ మర్మత్ హెచ్చరించారు. నగరంలోని 50, 51, 52 డివిజన్లలో గల రంగనాయకులపేట, కపాడిపాళెం ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కపాడిపాళెంలోని వీధుల్లో లిఫ్ట్ పాయింట్ల నుంచి చెత్తను వాహనాల ద్వారా సేకరించడాన్ని గమనించిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటి చెత్తను మాత్రమే సేకరించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే షోకాజ్ నోటీసులను జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నెల్లూరు సిటీ: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన రైల్వేఫీడర్స్ రోడ్డులో చోటు చేసుకుంది. సుమారు 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడు బ్లూ, గోధుమ రంగు కలిగిన ఫుల్ టీ షర్ట్, నలుపు రంగు కలిగిన డ్రాయర్, సిమెంట్ కలర్ లుంగీని ధరించి ఉన్నారు. సంతపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.